క్లుప్తంగా

జైభారత్ విద్యాసంస్థల స్థాపకుడు చంద్రమౌళికి నివాళి



క్రోసూరు: క్రోసూరులోని జైభారత్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు తిప్పిరెడ్డి చంద్రమౌళి(98) బుధవారం మృతి చెందిన విషయం తెలిసిందే. సమాచారం తెలుసుకున్న ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మనందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ అంజిరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, మాజీ ఏఎంసీ చైర్మన్ డాక్టర్ షరీఫ్, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, ఎంపీపీ కోటయ్య, కాల్వపల్లి సాంబిరెడ్డి, అప్పిరెడ్డి తదితరులు గురువారం చంద్రమౌళి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. చంద్రమౌళి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

బీజేపీది అరాచక పాలన

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు



సత్తెనపల్లిలో మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న గిడుగు రుద్రరాజు, నాయకులు

సత్తెనపల్లి: బీజేపీ అరాచక పాలన వల్ల గాంధీ ఇజం ప్రాధాన్యం పెరిగిందని పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్ర రాజు పేర్కొన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని రుద్రరాజు గురువారం ఆవిష్కరించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ చుక్క చంద్రపాల్ అధ్యక్షతన జరిగిన సభలో రుద్రరాజు మాట్లాడుతూ గాంధీజీ దేశానికి అందించిన సేవలను వివరించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సభలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర పద్మశ్రీ, పల్నాడు జిల్లా ప్రెసిడెంట్ అలెగ్జాండర్ సుధాకర్, పీసీసీ అధికార ప్రతినిధి రాధాకృష్ణ, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాకే శంకర్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచండి

ముప్పాళ్ళ: గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి చెప్పారు. ముప్పాళ్ళ గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. క్లాప్ మిత్రలతో మాట్లాడి చెత్తసేకరణ విధానంపై పలు సూచనలు చేశారు. ఆయనతోపాటుగా గ్రామ సర్పంచ్ మేడబలిమి సతీష్, ఈఓపీఆర్డీ రూపవతి, పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రచారభేరి



ముప్పాళ్ళ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం ముప్పాళ్ళలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో ప్రచార భేరీ నిర్వహించారు. ఈ నెల 30 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని సీపీఎం నాయకులు గుంటుపల్లిబాలకృష్ణ తెలిపారు. తౌరటి అమరలింగేశ్వరరావు, పఠాన్‌సైదాఖాన్, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, గారాజాలయ్య, కందిమళ్ళ సాంబశివరావు, మార్పులవెంకటరెడ్డి, నూకారపు సాంబశివరావు పాల్గొన్నారు.

అజాతశత్రువు వెంకట్రామయ్య

పెదకూరపాడు: ప్రజానాట్యమండలిలో ప్రధాన భూమిక పోషించిన ప్రముఖ రంగస్థల పద్య నాటక కళాకారులు పసుపులేటి వెంకట్రామయ్య అజాత శత్రువని ప్రజా నాట్యమండలి నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు మునుగోటి శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని తమ్మవరం గ్రామంలో ప్రజా నాట్యమండలి నాయకులు పసుపులేటి వెంకట్రామయ్య వర్ధంతి సందర్భంగా సంస్మరణ సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకట్రామయ్య ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త ఉంగరాల సీతారామయ్య, భైరవపట్నం రామకృష్ణ, నందిగం వెంకటరత్నం, వెంకటేశ్వరరావు, చంద్రమ్మ, రాజు, మల్లేశ్వరరావు, సత్యం, రామయ్య, గుత్తికొండ కవీశ్వరానంద స్వామి పాల్గొన్నారు.

సంక్షేమ పాలన జగన్‌కే సాధ్యం

రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



పెదనెమలిపురిలో ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులతో మాట్లాడి కరపత్రాలను అందిస్తున్న రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: జన సంక్షేమ, సరికొత్త విప్లవాత్మక పాలనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సరికొత్త ఒరవడిని సృష్టించారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. గురువారం రాజుపాలెం మండల పరిధిలోని పెదనెమలిపురి గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వం ముద్రించిన కర పత్రాలను ఇంటింటికీ తిరిగి అందజేశారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. నాలుగేళ్లలో గడప గడపా పొందిన లబ్ధి గురించి వెల్లడించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. అధికారులతో మాట్లాడి పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సంయుక్తంగా గ్రామాలలో పర్యటించడంతో సందడి వాతావరణం నెలకొంది. అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి సూచించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామంలో 294 గృహాలను సందర్శించి యోగక్షేమాలు కనుక్కున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సునీతాశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ, ఎంపీటీసీ కందులూరి నాగేశ్వరరావు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్, సర్పంచ్ పులిబండ్ల అశోక్, కార్పొరేటర్ అచ్యుత శివప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మస్తాన్, నల్లగొర్ల సీతారామయ్య, బంకా పాపారావు, తాటికొండ అంకమ్మరాజు, వేదాద్రి, కొర్రకూటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో తలుపుల శ్రీనివాసరావు, తహసీల్దారు నళిని, పలు శాఖల అధికారులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి తిరునాళ్ల



విశేష అలంకరణలో శ్రీప్రసన్నాంజనేయస్వామి

నకరికల్లు: మండలంలోని చల్లగుండ్ల అడ్డరోడ్డు వద్ద వేంచేసిన శ్రీఅభయాంజనేయస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం గురువారం వైభవంగా జరిగింది. ఆలయాన్ని విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అర్చకులు వినుకొండ కొండమాచార్యులు ఆధ్వర్యంలో విశేషపూజాధికాలు నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించారు. తిరునాళ్ల సందర్భంగా స్వామిని దర్శించుకునేందుకు సమీప గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారి, నకరికల్లు– చీరాల ఓడరేవు రహదారి కూడలిలో ఆలయం ఉండడంతో సుదూరప్రాంతాల భక్తులు తరలివచ్చారు. గ్రామభక్తసంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డియూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. చిన్నారులు ఏర్పాటు చేసిన బాల ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి



స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు

సత్తెనపల్లి: యువత సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత స్థితికి చేరాలని ఉప విద్యాశాఖ అధికారి వి.వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు. హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు పట్టణంలోని శ్రీ బాబా గురుదేవ్ డిగ్రీ , పీజీ కాలేజీలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. జాబ్‌మేళాకు హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు అధ్యక్షత వహించారు. ఉప విద్యాశాఖ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ యువత సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆత్మీయ అతిథి గుంటూరు జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు కాగితాల స్వాతి గౌడ్ మాట్లాడుతూ దేశ సంపద యువత అన్నారు. కళాశాల డైరెక్టర్ మట్ట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ హెల్ప్ ఫౌండేషన్ ఎన్నో మంచి వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టడంలో ముందుంటుందన్నారు. ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డి.మాధవి, హెల్ప్ ఫౌండేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, హెల్ప్ ఫౌండేషన్ పల్నాడు జిల్లా కో–ఆర్డినేటర్ సురేష్, వివిధ కంపెనీల మేనేజర్లు, ఫౌండేషన్ సభ్యులు నాని, సోమశేఖర్, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- పెదనెమలిపురిలో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులు



టీడీపీ నుంచివైఎస్సార్ సీపీలోకి చేరిన నాయకులకు సాదరంగా స్వాగతం పలుకుతున్న రాష్ట్ర మంత్రి అంబటి

రాజుపాలెం: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు రాష్ట్ర జలవనరుల శాఖమంత్రి అంబటి రాంబాబు చెప్పారు. గురువారం రాజుపాలెం మండలం పెదనెమలిపురి గ్రామంలో తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన నాయకులకు ఆయన పార్టీ కండువాలు కప్పి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముందుగా గుత్తా వెంకట్రావు(జిన్నియ్య), గుత్తా లక్ష్మీనారాయణ, గాలి శ్రీనివాసరావు, కొత్తపల్లి సత్యనారాయణ, బత్తుల ఆంజనేయులుకు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం అంబటి మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఈ గ్రామం నుంచి వైఎస్సార్ సీపీకి మెజార్టీ రాలేదని, ఇప్పుడు చేరికలతో వచ్చే ఎన్నికల్లో గ్రామం నుంచి అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర పులిబండ్ల అశోక్, సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ,జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ కొండ్రెడ్డి పరమేష్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేడే గడప గడపకు మన ప్రభుత్వం

మండలంలోని పెదనెమలిపురిలో శుక్రవారం సాయంత్రం 3 గంటల నుంచి రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని నాయకులు కోరారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: సంక్షేమ పథకాల అమలు, గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులైన కోనూరు గ్రామానికి చెందిన కొంతమంది టీడీపీ వర్గీయులు బుధవారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే శంకరరావు సాదరంగా ఆహ్వానం పలికి పార్టీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు. పంచాయతీ వార్డు సభ్యుడు మైలా వెకటేశ్వరరావుతోపాటు నాగరాజు, కోటయ్య, శివతేజ, ఏడుకొండలు తదితరులు కుటుంబాల సమేతంగా వైఎస్సార్ సీపీలో చారారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, సర్పంచ్ ఏకుల నీలాంబరం, ఎంపీటీసీ యంగ్రపల్లి నటరాజు, కస్తల సర్పంచ్ షేక్ మాబూసుభాని, నెల్లూరి చంద్రబాబు, మాజీ సర్పంచ్ వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, మచ్చా శ్రీనివాసరావు, కాపు నాయకులు పసుపులేటి జనార్ధనరావు, గ్రామ పార్టీ కన్వీనర్ పాగెళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు సీఎం జగన్‌కే సాధ్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



కోనూరులో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరరావు

అచ్చంపేట: సంక్షేమ పథకాల అమలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన బాధ్యత మనదేనని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. కోనూరులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం రాత్రి మూడోరోజు జరిగింది. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. నాలుగేళ్లలో ప్రతి గడపా పొందిన లబ్ధి గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ వలంటీర్ల సేవలు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా, సత్వర సేవలు అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించారు. గత నాలుగేళ్లలో గ్రామంలో రూ.12కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని ఎమ్మెల్యే వివరించారు. మరో రూ.3 కోట్లతో గ్రామంలో పాఠశాలలు, రోడ్లు ఆధునికీకరించినట్టు చెప్పారు. సచివాలయాలు, హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించామన్నారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయిలు ఇచ్చే పనులను చేస్తున్నామని చెప్పారు. గతంలో ఇన్ని పనులు ఎవరైనా చేశారా.. ఇన్ని పథకాలు అందాయా అని ప్రశ్నించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, వ్యవసాయ యూనివర్శిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, సర్పంచ్ ఏకుల నీలాంబరం, ఎంపీటీసీ యంగ్రపల్లి నటరాజు, గ్రామపార్టీ కన్వీనర్ పాగెళ్ల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ వాశిరెడ్డి వెంకటేశ్వరరావు, మత్సా శ్రీనివాసరావు, పసుపులేటి జనార్ధన్, గుడేటి శ్యాంసన్, మరియదాసు, సొసైటి మాజీ చైర్మన్ రామిశెట్టి చిన్న యల్లమందయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

సహకార సంఘాలను బలోపేతం చేసి, రైతులందరికీ మెరుగైన సేవలు అందేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చెప్పారు. అచ్చంపేట వ్యవసాయ సహకార సంఘ అధ్యక్ష ప్రమాణస్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా సంఘ చైర్మన్‌గా నియమితులైన రామిశెట్టి రంగయ్య, సంఘ డైరెక్టర్లు సాతర్ల శ్రీనివాసరావు, తుమ్మలూర్లు మర్రెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ కంబాల వీరబాబు పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, రైతులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

నకరికల్లు: వేసవి నేపథ్యంలో ప్రతి గ్రామంలో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం వీఆర్వోలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటితీరువా బకాయిలను వసూలు చేయాలన్నారు. రేషన్‌సరుకుల పంపిణీ సక్రమంగా జరిగేలా చూసుకోవాలన్నారు. జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా భూయజమానుల నుంచి హక్కుపత్రాలు సేకరించాలన్నారు. రబీ సీజన్‌కు సంబంధించి ఈ–క్రాప్ నమోదు చేసుకున్న రైతుల వివరాలను వీఆర్వో లాగిన్‌లో పొందుపరచాలన్నారు. బెనిఫిషియర్స్ ఔట్ రీచ్ యాప్‌లో పెండింగ్‌లో ఉన్న కుల, ఆదాయధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలన్నారు.

నేడు నీలేశ్వరపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం

అచ్చంపేట: అచ్చంపేట సచివాలయం–2 పరిధిలోని నీలేశ్వరపాలెంలో శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తారని పేర్కొన్నారు.

'ఇసుక పాలసీపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు'

అమరావతి: ఇసుక పాలసీపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదని, నియోజకవర్గంలో ఇసుక పేరుతో యథేచ్ఛగా దోపిడీ చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌దేనని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి విమర్శించారు. గురువారం అమరావతిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు జరిపితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ 100 కోట్ల రూపాయలు జరిమానా విధించిన విషయం అప్పుడే మరిచిపోయారా అని చంద్రబాబును ప్రశ్నించారు. ఎమ్మెల్యే శంకరరావు నిస్వార్థంగా అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారని కొనియాడారు. ఆయనపై విమర్శలు తగవన్నారు. వైఎస్సార్‌సీపీ నర్సారావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అధికారప్రతినిధి నందూరు కరుణకుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి మంగిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ టీడీపీ నేతల వ్యవహార శైలిని దుయ్యబట్టారు. సమావేశంలో మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, ఎండ్రాయి గ్రామ సర్పంచి నాయుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి అలా లక్ష్మీనారాయణ,రోసిబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాలెమర్రులో చర్చి ప్రతిష్ఠామహోత్సవం

క్రోసూరు: బాలెమర్రు గ్రామంలో ఎంపీ లావు కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు కలిసి శుక్రవారం చర్చి ప్రతిష్ఠామహోత్సవ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు గురువారం తెలిపారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

మాదల(ముప్పాళ్ళ): విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు వ్యాపించి పూరిల్లు దగ్ధమైన ఘటన మాదలలోని ఎస్సీ కాలనీలో గురువారం తెల్లవారుజామున జరిగింది. కాలనీకి చెందిన చింతపల్లి పిచ్చయ్య తన కుటుంబసభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి పైకప్పు నుంచి మంటలు రావటం గమనించాడు. కుటుంబసభ్యులను అప్రమత్తం చేసి బయటకు పంపించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాడు. అప్పటికే ఇంటిలోని దుస్తులు, ఫ్యాన్‌లు, బీరువాతో పాటుగా అందులో ఉన్న రూ.20వేల నగదు పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల సాయంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. ఘటనా స్థలాన్ని వీఆర్వో హరిప్రసాదు పరిశీలించి బాధితుల నుంచి ఆస్తినష్టం వివరాలు నమోదు చేసుకున్నారు. సుమారు రూ.లక్షన్నర వరకు నష్టం ఉంటుందని అంచనా వేశారు. బాధితులకు తక్షణ ప్రభుత్వసాయంగా 20కేజీల బియ్యాన్ని అందించారు.

చౌకబారు విమర్శలు చేస్తే ఉపేక్షించం

అచ్చంపేట: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మతి భ్రమించి మాట్లాడుతున్నారని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చౌకబారు విమర్శలు చేస్తే ఉపేక్షించబోమని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అమరావతి, సత్తెనపల్లి రోడ్డుషోలు అట్టర్‌ఫ్లాప్ కావడంతో ఎమ్మెల్యే శంకరరావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెదకూరపాడు నియోజకవర్గంలో ఇసుక దోపిడీకి ఆద్యుడు కన్నా లక్ష్మీనారాయణేనని విమర్శించారు. ఇసుక దందాలో కోట్లు కూడబెట్టింది మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధరే అని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో ఆ పార్టీ నేతలు ఇసుక కోసం కృష్ణానదిలో గోతులు తీస్తే వాటిల్లో పడి 28 మంది అమాయకులు మరణించారని, ఒకరికి కూడా పరిహారం ఇవ్వలేదని దుయ్యబట్టారు. గత నాలుగేళ్లలో నియోజకవర్గంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో వందల కోట్ల రూపాయల సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, టీడీపీ హయాంలో ఒక్కటైనా జరిగాయా అని వైఎస్సార్ సీపీ నేతలు ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, సర్పంచ్ కుంభాల వీరబాబు, లీడ్‌క్యాప్ డైరెక్టర్ ఎక్కిరావల మురళి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, ఉప సర్పంచ్ జాని, మాజీ సర్పంచ్ మల్లికార్జునరావు, పీఏసీస్ చైర్మన్ రామిశెట్టి రంగయ్య, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

సత్తెనపల్లి: ఇంటర్మీడియట్ ఫలితాల్లో విద్యార్థులు సత్తా చాటారు. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సీనియర్ ఇంటర్‌లో 76 మంది విద్యార్థులకు 65 మంది ఉత్తీర్ణులయ్యారు. 85.54 శాతం ఉత్తీర్ణత సాధించారు. సీనియర్ ఇంటర్ బైపీసీ లో షేక్ సల్మా 964, టి.మనీషా 937 మార్కులు సాధించారు. జూనియర్ ఇంటర్‌లో 73 మందికి 55 మంది ఉత్తీర్ణులయ్యారు. 75.34 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో ఎం.నవ్య 434, డి.సౌమ్య 434, ఎం.పునీత 432, జి.అన్నపూర్ణ 400 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.ఎస్.వి.స్వర్ణకుమారి గురువారం తెలిపారు. పట్టణంలోని రఘురాంనగర్‌లోని ఎస్వీఆర్ విద్యా కేంద్రం విద్యార్థులు ఇంటర్‌లో ప్రతిభ చూపినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.వి.నాగిరెడ్డి తెలిపారు. జూనియర్ ఇంటర్ సీఈసీ గ్రూపు విద్యార్థి షేక్ రిజ్వానా 479 మార్కులతో పల్నాడు జిల్లాలోని ప్రథమ స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ గ్రూపు విద్యార్థి షేక్ బాజీ 451 మార్కులతో పట్టణంలో ద్వితీయ స్థానంలో నిలిచాడని వివరించారు. బైపీసీ విద్యార్థి ఎం.క్షేత్ర 417 మార్కులతో పట్టణంలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. మరో 27 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ ఎం.వెంకట్రావు అభినందించారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

క్రోసూరు: క్రోసూరు మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ సౌరిరాజు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 37 మంది ఉత్తీర్ణత సాధించారు. జూనియర్ ఇంటర్ పరీక్ష ఫలితాల్లో 126 మంది విద్యార్థులకు 53 మంది ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

జూనియర్ ఇంటర్ ఎంపీసీలో సీహెచ్ చంద్రిక 434, వెంకటరమణ 428, యు.హారిక 421 మార్కులు సాధించారని, బైపీసీలో కె.శ్రీలక్ష్మి 380, ఎం.శివగంగ 371, షేక్ కరీనా 367 మార్కులు సాధించారని, సీఈసీలో వై.నాగలక్ష్మి 405, జి.కీర్తి 390, కె.వైష్ణవి 374 మార్కులు సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీలో ఎస్.పూజిత 907, ఎస్.మహాలక్ష్మి 900, షేక్ సమీరా 898 మార్కులు సాధించారని, బైపీసీలో సీహెచ్ దివ్య 923, వై.అమూల్య 885, టి.గోపిక 881 మార్కులు సాధించారని వివరించారు. సీఈసీలో ఎస్.సంధ్యారాణి 885, జి.లావణ్య 744 , డి.వెంకటేశ్వరమ్మ 741 మార్కులు సాధించారని వెల్లడించారు.

పల్లోటి కాలేజీ ప్రతిభ

అమరావతి: ఇంటర్ ఫలితాల్లో అమరావతి పల్లోటి జూనియర్ కాలేజీ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ పి.కృష్ణమోహన్ తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో ఎస్.వసంతలక్ష్మి 987, కె.వైష్ణవి 986, ఆర్.నాగరమ్య 981 మార్కులు సాధించారని పేర్కొన్నారు. బైపీసీలో సి.హెచ్.రూపశ్రీ 985, ఎం.శివ మాధవ్ 982, ఎస్.కె.సునీయా 976 మార్కులు సాధించారని వివరించారు. విద్యార్థులను కరస్పాండెంట్ ఫాదర్ జి.భాస్కర్, జీవన్ అభినందించారు.

శ్రీధాన్యకటక అకాడమీ సత్తా

ధరణికోట రాజావాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళాశాలలో కొత్తగా ప్రారంభించిన శ్రీధాన్యకటక అకాడమీ 60మంది విద్యార్థులు ఇంటర్ ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీ విద్యార్థి సీహెచ్ పల్లవి 463 మార్కులు సాధించింది.

అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రతిభ

స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీనియర్ ఇంటర్‌లో 77శాతం జూనియర్ ఇంటర్‌లో 65శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ పద్మజ తెలిపారు, సీనియర్‌ఇంటర్ ఎంపీలో ఎం.మానస 959, కె.శిరీషా 941 మార్కులు సాధించినట్లు వివరించారు.

ఎమ్మెల్యే నంబూరుపై విమర్శలు తగవు

పెదకూరపాడు: అబద్ధాలు చెప్పే టీడీపీ అధినేత చంద్రబాబు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుపై విమర్శలు చేయడం తగదని వైఎస్సార్ సీపీ నాయకులు హితవుపలికారు. పెదకూరపాడులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు హయాంలో నారా హమారా కార్యక్రమంలో ప్లకార్డులు ప్రదర్శించిన ముస్లింలపై దేశ ద్రోహం కేసు నమోదు చేయలేదా అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు చంద్రబాబు మైనార్టీ సంక్షేమ శాఖను నిర్వీర్యం చేశారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో కృష్ణానదిలో గోతులు తవ్వి 28 మంది మరణానికి మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కారకులయ్యారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, మండల పరిషత్ అధ్యక్షుడు బెల్లంకొండ మీరయ్య, జిల్లా పార్టీ కార్యదర్శి కంకణాల శివాజీ, వైస్ ఎంపీపీ షేక్ చాంద్‌బాషా, గ్రామ సచివాలయాల కన్వీనర్ మాగులూరి అనిల్‌కుమార్, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ షేక్ మస్తాన్‌షరీఫ్, సొసైటీ డైరెక్టర్ కల్లి శ్రీనివాసరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్లు షేక్ సుభాని, సాతులూరి రాజు, ఎస్సీ సెల్ నాయకులు నల్లపాటి యోహాను, అచ్యుతరావు, జిల్లా కార్యదర్శి బి.హనుమంతరావు, మైనార్టీ నాయకులు షేక్ అదంషఫీ, రహీం, ఎంపీటీసీ కె.నిర్మలాగోవింద్ పాల్గొన్నారు.

రేపు వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, కళా ప్రపూర్ణ, పద్మభూషణ్ వావిలాల గోపాలకృష్ణయ్య వర్ధంతి సభ వావిలాల సంస్థ గుంటూరు, వావిలాల ప్రజ్వలన సంస్థ సత్తెనపల్లి వారి ఆధ్వర్యంలో ఈనెల 29న ఉదయం 10 గంటలకు పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావు పేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, పల్నాడు కలెక్టర్ లోతేటి శివశంకర్, సత్తెనపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, విజయనగరం జట్టు ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ పారినాయుడు, వావిలాల సంస్థ సంయుక్త కార్యదర్శి మన్నవ సోడేకర్ హాజరవుతారని పేర్కొన్నారు.